సాక్షి
కుమురం భీం

మంగళవారం । 13 । జూన్ । 2023



అడవికి రక్షకులు..!
అడవులు, వన్యప్రాణుల రక్షణలో బేస్‌క్యాం పు సిబ్బంది సేవలు ఎంతో ప్రధానమైనవి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 245 మంది పనిచేస్తున్నారు.
8లో▸



తొలకరి జల్లుతో రైతన్న బిజీ
తొలకరి జల్లులతో రైతులు బిజీగా మారారు. పొలాల్లో దుక్కులు దున్నడం, సేంద్రియ ఎరువులు చల్లడం వంటి పనులతో సందడి నెలకొంది.
9లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
41.5 /30.6
ఎండ తీవ్రత కొనసాగుతుంది. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. పగలు వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

బడికి డుమ్మా!

- వేసవి సెలవుల అనంతరం పునఃప్రారంభమైన పాఠశాలలు
- తొలిరోజు 26 శాతమే హాజరు
- ప్రభావం చూపిన ఎండల తీవ్రత
- పారిశుధ్య పనులు చేపట్టిన పంచాయతీ సిబ్బంది



ఆసిఫాబాద్ మండలం మోతుగూడ పాఠశాలలో 107 మందికి ఐదుగురే హాజరు


కౌటాల ప్రాథమిక పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం బడిగంట మోగింది. సోమవారం నుంచి 2023– 24 కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైంది. అయితే రికార్డు స్థాయిలో నమోదవుతున్న పగటి ఉష్ణోగ్రతలతో మొదటి రోజు విద్యార్థులు స్కూళ్లకు డుమ్మా కొట్టారు. చాలాచోట్ల విద్యార్థుల కంటే ఉపాధ్యాయులే ఎక్కువ మంది బడులకు వచ్చారు. జిల్లాలో డీఈవో పరిధిలో 747 పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 46,346 మంది విద్యార్థులకు సోమవారం కేవలం 12,200 మంది తరగతులకు హాజరయ్యారు. 26 శాతం మాత్రమే హాజరు నమోదైంది. వందకు మించి విద్యార్థులు ఉన్న ఉన్నత పాఠశాలల్లో కూడా 10 నుంచి 15 మంది విద్యార్థులు రాలేదు. బడుల పునఃప్రారంభం నేపథ్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 2,360 మందికి కొత్తగా అడ్మిషన్లు కల్పించారు. ఈ నెల 20న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ రోజు సాంస్కృతిక కార్యక్రమలు నిర్వహించడంతోపాటు మన ఊరు– మన బడి పథకం కింద పూర్తయిన పాఠశాలలను ప్రారంభించనున్నారు.

జిల్లా కేంద్రంలో బడులు వెలవెల
ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు తొలిరోజు విద్యార్థులు లేక వెలవెలబోయాయి. జెడ్పీ బాలుర పాఠశాలలో 315 మందికి 25 మంది హాజరు కాగా, బాలికల ఉన్నత పాఠశాలలో 330 మందికి కేవలం 30 మంది విద్యార్థినులు మాత్రమే హాజరయ్యారు.

సెలవులు పొడిగిస్తారని...

దహెగాం(సిర్పూర్): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 70 మంది విద్యార్థులకు తొలిరోజు కేవలం 15 మంది మాత్రమే తరగతులకు హాజరయ్యారు. కొత్తగా ఎనిమిది మంది ప్రవేశం పొందారు. అదనపు తరగతి గదుల భవన నిర్మాణం పునాది దశలోనే ఉంది.
చింతలమానెపల్లి/పెంచికల్‌పేట్: చింతలమానెపల్లి బారెగూడ ప్రాథమిక పాఠశాలలో 76 మందికి తొలిరోజు కేవలం 29 మంది మాత్రమే హాజరయ్యారు. పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 75 మందికి 25 మంది తరగతులకు హాజరయ్యారు. ఎండల తీవ్రతతో వేసవి సెలవులు పొడిగిస్తారని సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో విద్యార్థులు పాఠశాలను పంపలేదని తల్లిదండ్రులు చెబుతున్నారు.


దహెగాం ప్రాథమిక పాఠశాలలో తక్కువగా హాజరైన విద్యార్థులు

బడిలో కేక్ కటింగ్

తిర్యాణి(ఆసిఫాబాద్): మండలంలోని జెడ్పీ పాఠశాలలో 122 మంది విద్యార్థులు 17 మంది మాత్రమే హాజరయ్యారు. మంగీ పంచాయతీ పరిధిలోని కొలాంగూడ గిరిజన పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయుడు వెంకటేశ్ వినూత్నంగా స్వాగతం పలికారు. స్కూల్ ఆవరణలో విద్యార్థులతో కేక్ కట్ చేయించారు.

ఇక్కడ ఒక్కరూ రాలేదు..


నదిమాబాద్‌లో విద్యార్థులు లేక ఖాళీగా కూర్చున్న ఉపాధ్యాయుడు

కౌటాల(సిర్పూర్): కౌటాల మండలంలోని పలు పాఠశాలలకు తొలిరోజు ఒక్కరూ కూడా హాజరుకాలేదు. నదిమాబాద్ పాఠశాలలో 28 మంది విద్యార్థులకు బడికి ఒక్కరూ కూడా రాలేదు. దీంతో ఉపాధ్యాయుడు రవి ఒక్కరే ఉన్నారు. జీపీ కార్మికుడిని విద్యార్థులను పిలిచేందుకు గ్రామంలోకి పంపించారు. అలాగే తలోడి పాఠశాలలో 32 విద్యార్థులకు ఒక్కరూ హాజరుకాలేదు. సదాశివపేట ప్రాథమిక పాఠశాలలో కూడా తొలిరోజు సున్న హాజరుశాతం నమోదైంది. కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 443 మందికి కేవలం 8 మంది, కౌటాల ప్రాథమిక పాఠశాలలో 82 మందికి 32 మంది మాత్రమే వచ్చారు. మండల వ్యాప్తంగా 2,899 మంది విద్యార్థులకు తొలిరోజు కేవలం 678 మంది మాత్రమే హాజరయ్యారు.


బడిని శుభ్రం చేస్తున్న కార్మికులు

నిర్మాణం.. నిరుపయోగం!


నిరుపయోగంగా పిట్టగూడ పాఠశాల

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలం పిట్టగూడ గ్రామంలో 20 ఏళ్ల క్రితం పాఠశాల భవనం నిర్మించారు. టీచర్ పోస్టు మంజూరు కాకపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది. గ్రామంలోని 15 మంది విద్యార్థులు ఇతర గ్రామాల్లోని పాఠశాలలకు వెళ్తున్నారు. నెహ్రూనగర్ ప్రాథమిక పాఠశాలలో 95 మంది విద్యార్థులకు 40 మంది హాజరయ్యారు. ఐదుగురికి యూనిఫాంలు అందించారు. 'బడిబాట'లో 15 మందిని గుర్తించగా ఐదుగురిని బడిలో చేర్పించారు.

తొలిరోజే నీటి సమస్య


చిన్నసిద్దాపూర్ పాఠశాలలో పనిచేయని చేతిపంపు

బెజ్జూర్(సిర్పూర్): చిన్న సిద్దాపూర్ ప్రభుత్వ పాఠశాలలో తొలిరోజే విద్యార్థులు నీటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాఠశాల ఎదుట ఏర్పాటు చేసిన చేతిపంపు పనిచేయడం లేదు. మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత ఇళ్లకు వెళ్లి తాగునీరు తెచ్చుకున్నారు. ఇక్కడ మరుగుదొడ్లు కూడా లేవు. మరో 15 పాఠశాలల్లోనూ నీటి సమస్య ఉంది. మొత్తం 17 పాఠశాలలు 'మన ఊరు– మన బడి' కింద ఎంపికైతే రెండుచోట్ల మాత్రమే పనులు పూర్తయ్యాయి.

హైస్కూళ్లలో అతి తక్కువగా..


విద్యార్థులకు పూలు అందిస్తూ స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలో మొదటిరోజు కేవలం 25 శాతం విద్యార్థులు మాత్రమే పాఠశాలలకు హాజరయ్యారు. ప్రాథమిక పాఠశాలల్లో హాజరు శాతం కాస్త పర్వాలేదనిపించినా హైస్కూళ్లకు అతితక్కువగా విద్యార్థులు హాజరయ్యారు. 'మన ఊరు– మన బడి' కింద 20 పాఠశాలలు ఎంపిక కాగా, గంగాపూర్, పుంజుమేరగూడ బడులను ప్రారంభించారు. నేర్పల్లి, తుంగెడ పాఠశాలల్లో పనులన్నీ పూర్తయ్యాయి. పులికుంట కాలనీ పాఠశాలను మామిడి తోరణాలతో అలంకరించి, విద్యార్థులను పూలతో స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

చట్టపరిధిలో బాధితులకు సత్వర న్యాయం


అర్జీ పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్అర్బన్: చట్టపరిధిలో బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు పెంచాలి


విద్యార్థులతో డీఈవో అశోక్

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో నూతన ప్రవేశాలు పెంచాలని డీఈవో అశోక్ అన్నారు. ఆసిఫాబాద్ మండలంలోని గుండి, గోవింద్‌పూర్ పాఠశాలలను సోమవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. తొలిరోజు హాజరు శాతం తక్కువగా నమోదైందన్నారు. నూతన విద్యావిధానంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం రావాలంటే టీచర్లు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బాపురావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

14 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: ఈ నెల 14 నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయని డీఈవో అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఆసిఫాబాద్‌లో 3, కాగజ్‌నగర్‌లో 3 మొత్తం ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు 30 నిమిషాలు ముందే సెంటర్లకు చేరుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాల/కళాశాలలో వివిధ పోస్టుల్లో పనిచేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ శాఖ అధికారి షేక్ మైముంద్ ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ గురుకులంలో టీజీటీ, పీజీటీ, జేఎల్, పీఈటీ పోస్టుల కోసం ఈ నెల 19 లోగా నేరుగా గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఖాళీలు ఏర్పడితే ఎంపికైన అభ్యర్థులకు అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులను సంసిద్ధం చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న విద్యాదినోత్సవం సందర్భంగా నిర్వహించే హ్యాకథాన్ పోటీలకు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులను సంసిద్ధం చేయాలని జిల్లా సైన్స్ అధికారి మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా సైన్స్ ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. ప్రాజెక్టుల తయారీకి సంబంధించిన కృత్యాల లిస్టను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. వివరాలకు 94411 40434 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

'ప్రైవేట్ పాఠశాలల్లో దోపిడీ అరికట్టాలి'

దహెగాం(సిర్పూర్): ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాం పేరిట జరిగే దోపిడీని అరికట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మీసారి చిరంజీవి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలను తనిఖీ చేయగా ఓ రూం నిండా బుక్స్ స్టోర్ చేసి విద్యార్థులకు అమ్ముతున్నారని ఆరోపించారు. విద్యను వ్యాపారం చేస్తున్న సదరు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎంఈవో, డీఈవోకు ఫిర్యాదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్, రుషి తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: ప్రజావాణి ద్వారా తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా గృహలక్ష్మి పథకం కింద ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం అందించాలని ఆసిఫాబాద్ మండలం పర్శనంబాల గ్రామానికి చెందిన కొయ్యల సౌందర్య దరఖాస్తు చేసుకుంది. వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కాగజ్‌నగర్‌కు చెందిన 66 ఏళ్ల జీవరత్నం కోరాడు. డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని ఆసిఫాబాద్ మండలం చిర్రకుంటకు చెందిన మాల్కడి గోపాల్ అర్జీ సమర్పించాడు. దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని ఆసిఫాబాద్ మండలం సింగరావుపేటకు చెందిన అగ్గిల రమేశ్ కలెక్టర్‌ను వేడుకున్నాడు. పెంచికల్‌పేట్ మండలం పెద్దవాగు బ్రిడ్జి నిర్మాణంలో కోల్పోయిన 20 గుంటల భూమికి పరిహారం చెల్లించాలని దహెగాం మండలం పంబపూర్‌కు చెందిన కందునూరి సత్యనారాయణ దరఖాస్తు చేసుకున్నాడు. ఉపాధిహామీ పథకంలో పనిచేసిన 8 వారాల నగదు ఇప్పించాలని తిర్యాణి మండలం కొటగాంకు చెందిన అమృతరావు అర్జీ సమర్పించాడు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఎనిమిది కేంద్రాల్లో ఉదయం ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు డీఐఈవో శ్రీధర్ సుమన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఫస్టియర్‌లో జనరల్ విభాగంలో 555 మంది విద్యార్థులకు 524 మంది హాజరు కాగా 31 గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 37 మందికి 31 హాజరయ్యారు. సెకండియర్ జనరల్ విభాగంలో 103 మందికి 99 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 20 మందికి 18 హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారు.


జిల్లా కేంద్రంలో పరీక్షను పర్యవేక్షిస్తున్న డీఐఈవో శ్రీధర్ సుమన్

రన్నింగ్‌తో శారీరక దృఢత్వం

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఉత్సాహంగా తెలంగాణ రన్



ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నుంచి 2.5కే రన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్: రన్నింగ్‌తో శారీరక దృఢత్వం కలుగుతుందని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రన్‌ను ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, రాజేశంతో కలిసి ప్రారంభించారు. ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నుంచి అంబేద్కర్‌చౌక్, కుమురంభీం చౌక్, కొత్త కలెక్టరేట్ మీదుగా 2.5కిలోమీటర్లు ఉత్సాహంగా కొనసాగింది. కలెక్టర్ మాట్లాడుతూ యువత మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేందుకు పోటీలు ఉపయోగపడతాయన్నారు. పోలీసులు ఫిట్‌నెస్ కాపాడుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. ఎస్పీ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ రన్నింగ్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. తాను ప్రతిరోజూ 10 కిలోమీటర్లు రన్నింగ్ చేస్తానని తెలిపారు. జీవితంలో ఆస్తులు సంపాదించడం సులభమని, ఆరోగ్యంగా ఉండడం కష్టమని పేర్కొన్నారు. 2.5కే రన్‌లో పాల్గొన్న యువత, విద్యార్థులను అభినందించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పురుషుల విభాగంలో పిప్రె నాగార్జున ప్రథమ స్థానంలో నిలవగా, పిప్రె శ్రీనివాస్ ద్వితీయ స్థానం, కిరణ్ తృతీయ బహుమతి సాధించారు. మహిళా విభాగంలో గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన జంగుబాయి ప్రథమ, దివ్యజ్యోతి ద్వితీయ బహుమతి సాధించారు. పోలీసు విభాగంలో తిర్యాణి ఎస్సై చంచు రమేశ్ ప్రథమ బహుమతి, జైనూర్ సీఐ రామకృష్ణ ద్వితీయ బహుమతి పొందారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గాదెవేణి మల్లేశ్, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవడం సరికాదు

ఆసిఫాబాద్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన కేజీబీవీ కాంట్రాక్టు ఉద్యోగులను ఈ ఏడాది తిరిగి విధుల్లోకి తీసుకోవడం సరికాదని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాగజ్‌నగర్ పట్టణంలోని కేజీబీవీలో విద్యార్థిని మృతికి బాధ్యులుగా ముగ్గురు కాంట్రాక్టు ఉద్యోగులను గతేడాది విధుల నుంచి తొలగించారని పేర్కొన్నారు. వారికి మళ్లీ ఈ ఏడాది పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. పోస్టుల భర్తీకి ప్రోత్సహించిన విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కొరెంగ మాలశ్రీ, దుర్గం నిఖిల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్తీక్

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతి


గేదెల మృతదేహాలు

దహెగాం: మండలంలోని చిన్నరాసం గ్రామ సమీపంలో విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతిచెందాయి. రైతులు ఏమ శంకరయ్య, జంగిటి పర్వతాలకు చెందిన గేదెలు సోమవారం ఉదయం మేతకు వెళ్లాయి. గ్రామ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ వైర్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు. కాగా, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని రైతులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి


గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

నస్పూర్: పట్టణంలోని నస్పూర్ గేటు సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడి వడదెబ్బతో మృతిచెందినట్లు ఎస్సై రవికుమార్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఓ మార్బల్ షాప్ వెనుకాల వేపచెట్టు కింద వృద్ధుడు చనిపోయి ఉన్నాడు. అతని వయస్సు 75 నుంచి 80 ఏళ్లు ఉండవచ్చని, తెల్లని దోవతి, ఫుల్ బనియన్, బ్లూ కలర్ స్లిప్పర్స్ ధరించాడు. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మృతదేహం భద్రపర్చామని, వృద్ధుడి వివరాలు తెలిస్తే సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై సూచించారు.

బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో జిల్లావాసి


సిల్వర్ మెడల్ సాధించిన స్థితప్రజ్ఞ రెడ్డి

మంచిర్యాలటౌన్: ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను స్పానిష్‌లో నిర్వహించగా, జిల్లా కేంద్రానికి చెందిన క్రీడాకారుడు స్థితప్రజ్ఞ రెడ్డి ఫైనల్‌కు చేరి సిల్వర్ మెడల్ సాధించినట్లు ఎంకే మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీ కోచ్ వికాస్ హర్ష తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో డెన్మార్క్ క్రీడాకారుడు భోగి భూజర్గ్‌తో తలపడి సిల్వర్ మెడల్ సాధించడంతో, క్రీడాకారుడిని, కోచ్‌ను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రెటరీ పుల్లూరి సుధాకర్, మీనారెడ్డి, వాసు, సత్యపాల్ రెడ్డి, రమేశ్‌రెడ్డి, మధు, కృష్ణ అభినందించారు.

వారు అడవితల్లి బిడ్డలు.. వన్యమృగాల మధ్య అడవి సింహాలు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అడవితల్లి రక్షణకు అడుగడుగునా గస్తీ నిర్వహిస్తున్నారు. నరికి వేతకు గురికాకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. కుటుంబానికి దూరంగా ఉంటూ.. అడవి తల్లికి అంగరక్షకులుగా పని చేస్తున్నారు. అడవి జంతువులను కాపాడటంలోనూ శ్రద్ధ చూపుతున్నారు. ఇలా ధైర్యసాహసాలతో విధులు నిర్వహిస్తున్న బేస్‌క్యాంప్ సిబ్బందిపై కథనం.. –జన్నారం


అడవిలో గస్తీ తిరుగుతున్న సిబ్బంది

అడవికి రక్షకులు..!

- రాత్రీపగలు అడవిలోనే గస్తీ
- తగ్గిన కలప అక్రమ రవాణా
- బేస్‌క్యాంప్ సిబ్బంది పనితీరు భేష్


గొండుగూడ బేస్‌క్యాంపు

నాలుగేళ్ల క్రితం ప్రారంభం

కవ్వాల్ పులుల రక్షిత ప్రదేశం. దట్టమైన అడవులు, వివిధ వన్యప్రాణులకు నిలయం. ఇక్కడ స్మగ్లింగ్ పెరుగుతుందనే ఉద్దేశంతో నాలుగేళ్ల క్రితం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బేస్‌క్యాంపులను ఏర్పాటు చేశారు. ఒక్కో క్యాంపునకు ఐదుగురిని నియమించారు. ప్రస్తుతం జన్నారం అటవీ డివిజన్‌లో 13, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 49 బేస్‌క్యాంపులున్నాయి. వీటిద్వారా 245 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నారు. వీరితో పాటు 59 మంది ఎనిమల్ ట్రాకర్స్ కూడా పని చేస్తున్నారు. ఏడు స్ట్రైకింగ్ ఫోర్స్‌లలో కూడా మరో 35మంది విధులు నిర్వహిస్తున్నారు.

జీత భత్యాలు.. సెలవులు

ఒక్కొక్కరికి రూ.12,046 వేతనం, రూ.3,380 ఫుడ్ అలవెన్స్ ఇస్తారు. రూ.900 ఈపీఎఫ్, ఇతర కటింగ్‌లు పోను సుమారు రూ.14 వేలు చెల్లిస్తారు. సిబ్బంది వారానికొకరు చొప్పున ఇళ్లకు వెళ్లాలి. ఒక వారం ఒకరు వెళ్తే.. మరో వారం మరొకరు వెళ్లాల్సి ఉంటుంది. అడవిలోపల ఉండే వారు మాత్రం నెలకోసారి వెళ్లివస్తుంటారు.

బేస్‌క్యాంపు సిబ్బంది విధులివీ..

బేస్‌క్యాంపు సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా నియమిస్తారు. 35 ఏళ్ల లోపువారికి 25 కిలోమీటర్ల నడక పరీక్ష, హెల్త్ ఫిట్‌నెస్ ద్వారా భర్తీ చేస్తారు. వీరు అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పర్మినెంట్ బేస్‌క్యాంపులలో ఉంటూ ఉదయం 6నుంచి సాయంత్రం 8గంటల వరకు అడవిలో కేటాయించిన ప్రదేశంలో గస్తీ తిరగాలి. స్మగ్లింగ్‌ను నిరోధించాలి. వన్యప్రాణులను రక్షించాలి. వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్లు, కుంటలను పరిశీలించాలి. వేటగాళ్లు నీటి కుంటల వద్ద ఉచ్చులు పెట్టకుండా గమనించాలి. అడవిలో అమర్చిన సీసీ కెమెరాలను పరిశీలించాలి. ప్రతీరోజు చుట్టూ 10 కిలో మీటర్ల దూరం వరకు నడుచుకుంటూ వెళ్లి అడవిని పరిశీలించాలి. చూసిన ప్రతీ అంశాన్ని మూమెంట్ రిజిష్టర్‌లో నమోదు చేయాలి. ఈ వివరాలు ప్రతీరోజు బీట్ అధికారి, సెక్షన్ అధికారి వీరి వద్దకు వెళ్లి తెలుసుకుంటారు. ఉన్నతాధికారులు వీరి పనితనాన్ని గమనిస్తారు. త్వరలో ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సాఫ్ట్‌వేర్ ద్వారా వారి మూమెంట్‌ను గుర్తిస్తారు.

క్యాంపు వద్ద వసతులు..

గతంలో బేస్‌క్యాంపు సిబ్బందికి ఎలాంటి సౌకర్యాలు లేవు. నీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వచ్చేది. రాత్రి చీకట్లో ఉండేవారు. జిల్లా కన్జర్వేటర్ వినోద్‌కుమార్, ఎఫ్‌డీవో మాధవరావు బేస్‌క్యాంపులను పటిష్టం చేసే దిశగా చర్యలు చేపట్టారు. ప్రతీ క్యాంపునకు పర్మినెంట్ గది ఏర్పాటు చేశారు. వారితో పాటు బీట్ గార్డు ఉండేలా గదులు నిర్మించారు. ప్రతీ క్యాంపు వద్ద సోలార్ లైట్, మంచె, నీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించారు. రాత్రి మంచెపై గస్తీ నిర్వహించడంతోపాటు విశ్రాంతి తీసుకునేలా ఏర్పాట్లు చేశారు.

గస్తీ విధులు ఇలా..

ఉదయం ఆరు గంటలకు నిద్ర లేస్తారు. వంట పాత్రలు శుభ్రం చేసి వండుకుంటారు. టిఫిన్ బాక్సులు, నీళ్ల బాటిళ్లతో అడవులకు బయలు దేరుతారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా అడవిలో ఎంచుకున్న ప్రాంతంలో తిరుగుతారు. వారి బేస్‌క్యాంపుల పరిధిలో నీటి చెలిమెలు, సాసర్ ఫిట్స్, జంతువుల కదలికలను గుర్తిస్తారు. ఆకలైన చోట అన్నం తింటారు. తిరిగి విధులు నిర్వహిస్తారు. సాయంత్రం 6గంటలలోపు తిరిగి క్యాంపునకు చేరుకుంటారు. భోజనం అనంతరం రాత్రి పది గంటల దాకా గస్తీ నిర్వహిస్తారు. కలప నరికివేతకు స్మగ్లర్లు వస్తున్నారనే సమాచారం ఉంటే అటు వైపు వెళ్లి అక్కడే నిఘా పెడతారు. రాత్రంతా అక్కడే ఉంటారు. సమాచారం అధికారులకు చేరవేస్తారు. ప్రస్తుతం అటవీ ప్రాంతాల్లో బారికేడ్లు, చెక్‌పోస్టులు, గేట్లు ఏర్పాటు చేశారు. రాత్రి క్యాంపులోని ఐదుగురిలో ఇద్దరు ఒక్కో గేటు వద్ద గస్తీ నిర్వహిస్తారు. ఒకరు బీట్ అధికారితో పాటు క్యాంపు వద్దే ఉంటారు. రాత్రి 10 తర్వాత అడవి జంతువులు, చిరుతపులుల, ఎలుగుబంట్ల అరుపులు వినిపిస్తాయి. మెకాలు, దుప్పులు అరుస్తాయి. వీరి పక్క నుంచే దుప్పులు, కొండగొర్లు, నీలుగాయిలు వెళ్తాయి. రాత్రి మంచె పక్కకు వస్తాయి. రాత్రి పూట అన్ని జంతువులూ కనిపిస్తాయి. అయినా వీరు జంకరు. బేస్‌క్యాంపుల ఏర్పాటుతో స్మగ్లింగ్ కొంతమేర తగ్గింది. రాత్రి వేళ సిబ్బంది గస్తీ తిరుగుతూ స్మగ్లర్లు వచ్చినట్లు తెలిస్తే అధికారులకు సమాచారం ఇచ్చి పట్టిస్తారు. దీంతో కేసులు నమోదు చేస్తుండడంతో స్మగ్లింగ్ తగ్గింది.

చిరుతను దగ్గరగా చూసిన



ఎనిమిది నెలలుగా పని చేస్తున్న. ఒకరోజు గస్తీలో ఉండగా రాత్రి 9గంటలకు చిరుతపులి 150 మీటర్ల దూరంలో కనిపించింది. అది నన్ను చూడలేదు కాబట్టి బతికిపోయా. రాత్రివేళ ఎన్నో వన్యప్రాణులు కనిపిస్తాయి. అలవాటైంది. ఇప్పుడా భయం కూడా పోయింది. – కోవ దౌలత్‌రావు, మల్యాల బేస్‌క్యాంప్ సిబ్బంది

సౌకర్యాలు బాగున్నయ్



మాది కెరమెరి మండలం చొపాన్ గూడ. రెండేళ్లుగా పని చేస్తున్న. గతంలో సౌకర్యాలు లేవు. ఇప్పుడు క్యాంపు దగ్గర సోలార్ లైట్ పెట్టిచ్చిన్రు. బోరింగు వేయించిన్రు. బాత్‌రూంలు, పర్మినెంట్ రూమ్ కట్టిచ్చిన్రు. సౌకర్యాలు మంచిగున్నయ్. జీతం పెంచితే బాగుండు.
– మడావి శేఖర్, మల్యాల బేస్‌క్యాంప్ సిబ్బంది

నిత్యం గస్తీ తిరుగుతం



రోజూ అడవిలో 10 కిలోమీటర్లు గస్తీ తిరుగుతం. వారానికోసారి అవసరమైన సరుకులు తెచ్చుకుంటం. ఉదయం వంట చేసుకుని అడవిలో గస్తీ తిరుగుతం. అడవిలో సీసీ కెమెరాలు, సోలార్ పంపులు, నీటి కుంటలు పరిశీలిస్తం. ఏదైనా ఇబ్బంది ఉంటే సార్లకు చెబుతం. – వసంతరావు, ఇందన్‌పల్లి బేస్‌క్యాంపు సిబ్బంది

స్మగ్లింగ్ తగ్గింది



బేస్‌క్యాంపు సిబ్బంది కారణంగా స్మగ్లింగ్ తగ్గింది. ఎప్పటికప్పుడు సిబ్బంది పనితీరు గమనిస్తున్నాం. విధుల్లో నిర్లక్ష్యం చేసినా, స్మగ్లర్లకు సహకరించినా తొలగిస్తాం. సిబ్బంది పని తీరు బాగుంటే తగిన ఫలితం ఉంటుంది. క్యాంపుల వద్ద వీరికి అన్ని సౌకర్యాలు కల్పించాం. – మాధవరావు, ఎఫ్‌డీవో

ఫోర్‌మెన్‌పై చర్య తీసుకోవాలి


డీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

శ్రీరాంపూర్: ఏరియా వర్క్‌షాప్‌లో ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న టీబీజీకేఎస్ నాయకుడు బ్రహ్మచారిపై చర్య తీసుకోవాలని హెచ్‌ఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ యూనియన్ బ్రాంచి కార్యదర్శి తిప్పారపు సారయ్య, కేంద్ర ఉపాధ్యక్షుడు వి.అనిల్‌రెడ్డి సోమవారం ఏరియా వర్క్‌షాప్ డీజీఎం చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రహ్మచారి కార్మికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే వారిపై కక్ష సాధిస్తున్నారని తెలిపారు. గతంలో ఎంవీ డ్రైవర్‌పై వేధింపులకు గురిచేస్తే అతను టింబర్ యార్డ్‌కు బదిలీ చేయించుకున్నారని అన్నారు. బ్రహ్మచారిపై ఇదివరకు ఫిర్యాదు చేసినా ఆయన పద్ధతి మారడం లేదన్నారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనం విజేతలు వీరే..

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ అస్తిత్వం–తెలంగాణ సాధించిన ప్రగతి అనే అంశంలో నిర్వహించిన కవి సమ్మేళన విజేతలను డీఈవో యాదయ్య సోమవారం ప్రకటించారు. వచన కవిత విభాగంలో పెద్ది భరత్, భూపతి సంతోష్, లేదల్ల రాజేశ్వర్, యోగేశ్వర్, వైద్య సుజాత ఎంపిక కాగా, పద్యం, గేయం విభాగంలో వామన్ రావు, పోటు హైమవతి, ప్రమీల, వసంత, బ్రహ్మయ్యను ఉత్తమ కవులుగా ఎంపిక చేశారు. దక్షిణామూర్తి, గాయత్రి, తోకల రాజేశం న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

డబ్బాలో డీఎస్పీ విచారణ


విచారణ చేస్తున్న డీఎస్పీ కరుణాకర్

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో సోమవారం విచారణ నిర్వహించారు. డబ్బా సర్పంచ్ కుమారుడు అబ్దుల్ రషీద్ తనను దూషించారంటూ కుమురం నారాయణ ఫిర్యాదు చేసిన విషయం విదితమే. కాగా ఈఘటనలో ఇరు వర్గాల నుంచి పోలీసులకు ఫిర్యాదులు అందాయి. అబ్దుల్ రషీద్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. గ్రామానికి చేరుకుని డీఎస్పీ విచారణ అనంతరం బాధితుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. వాంగ్మూలాలు రికార్డు చేశారు. కౌటాల సీఐ సాదిక్ పాషా, ఎస్సై విజయ్ కుమార్ ఉన్నారు.

అన్నను కాపాడబోయి..

- కరెంట్‌షాక్‌తో తమ్ముడు మృతి
- బూడిదగడ్డ బస్తీలో విషాదం

బెల్లంపల్లి: విద్యుత్‌షాక్‌కు గురైన అన్నను కాపాడేందుకు యత్నించి తమ్ముడు దుర్మరణం చెందాడు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో సోమవారం ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్య కథనం ప్రకారం.. బూడిదగడ్డ బస్తీలో ఉదయం 8:30 గంటల ప్రాంతంలో ఇసుక లోడ్‌తో వచ్చిన ట్రాక్టర్ ఓ వీధిలోకి వెళ్లింది. డ్రైవర్ తిరుపతి అజాగ్రత్తగా ట్రాక్టర్ నడిపి విద్యుత్ సర్వీసు తీగను ఢీకొట్టాడు. తీగ తెగి అక్కడే నిలిపి ఉంచిన ఆటో పై పడింది. పెండ్యాల రాజ్‌కుమార్ ఆటోలో ఉన్న తన ఇద్దరు పిల్లలు కాపాడే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. చిన్నారులు కదలకుండా ఆటోలో ఉండిపోయారు. రాజ్‌కుమార్‌కు వరుసకు తమ్ముడు శరత్‌కుమార్ (22) అక్కడికి చేరుకుని ఓ కర్రతో విద్యుత్ సర్వీసు వైరుపై కొట్టగా అది అతనికి తాకింది. ప్రాణాపాయం నుంచి బయటపడ్డ రాజ్‌కుమార్ తమ్ముడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అన్నను రక్షించడానికి వెళ్లిన శరత్ కుమార్ కరెంట్‌షాక్‌తో అర్ధాంతరంగా ప్రాణాలు వదలడం స్థానికులను తీవ్రంగా కలిచి వేసింది. మృతుడు ఓ షాపులో గుమాస్తాగా, అతని తండ్రి శ్రీనివాస్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఎదిగిన కొడుకు కళ్లముందే కానరాని లోకానికి వెళ్లడంతో తండ్రి రోధించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాన్ని సందర్శించి కుటుంబీకులను పరామర్శించారు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.


శరత్‌కుమార్ మృతదేహం

బాక్సింగ్‌లో ప్రతిభ


అభినందిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: జిల్లాస్థాయి సబ్ జూనియర్ అండర్–10, 12, 14లో ప్రతిభ కనబర్చిన శ్రీరాంపూర్ ఏరియా బాల, బాలికలను ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి అభినందించారు. సింగరేణి ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో ఇటీవల సమ్మర్ క్యాంప్ నిర్వహించగా బాక్సింగ్‌లో పలువురు శిక్షణ పొందారు. వారు ఈనెల 11న మంచిర్యాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో 7 బంగారు, 7 వెండి పతకాలు సాధించారు. జీఎం కార్యాలయం వద్ద జీఎం, అధికారులు సోమవారం వారిని అభినందించారు. గుర్తింపు సంఘం శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఓటూ జీఎం గోపాల్‌సింగ్, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్ సీనియర్, పీవో కాంతారావు, కోచ్ పాదం రవీందర్ పాల్గొన్నారు.

పైపుల లారీ ఢీకొని విరిగిన స్తంభం


స్తంభాన్ని ఢీకొట్టిన లారీ


షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన గడ్డివాము

- విద్యుత్ వైర్లు తెగిపడి గడ్డివాము దగ్ధం

వెన్నెల: మండలంలోని ఆవుడం గ్రామంలో మైలారం–ప్రాణహిత చేవెళ్ల మెగా కంపెనీ ప్రాజెక్టు నుంచి భారీ పైపులను తరలిస్తున్న లారీ సోమవారం సాయంత్రం రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో విరిగింది. రోడ్డు పక్కనే ఉన్న రత్నం శంకర్‌రెడ్డి అనే రైతుకు చెందిన వరి గడ్డివాముపై తీగలు తెగి పడటంతో దగ్ధమైంది. వెంటనే సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో 2 గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విద్యుత్ వైర్లు తెగిపడటంతో చుట్టుపక్కల వారికి స్వల్ప నష్టం జరిగింది. గడ్డివాము దగ్ధమైన బాధిత కుటుంబం లారీలను రోడ్డుపైనే ఆపి ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, మెగా కంపెనీ యజమానితో ఎంపీపీ రమాదేవి ఫోన్‌లో మాట్లాడగా స్తంభం విద్యుత్ వైర్లకు మరమ్మతు చేయిస్తామని, బాధిత రైతు కుటుంబానికి నష్టపరిహారం ఇస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.

కార్మికులకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి సీహెచ్‌పీలో విధులకు హాజరయ్యేందుకు వచ్చే కార్మికుల కోసం రోడ్డు సౌకర్యం కల్పించాలని హెచ్‌ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో సీహెచ్‌పీ ఇన్‌చార్జి డీజీఎం రాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీహెచ్‌పీలో పనిచేస్తున్న కార్మికులు డ్యూటీకి రావడానికి రోడ్డు సరిగా లేదన్నారు. జాతీయ రహదారి నుంచి కార్మికులు మూడు షిఫ్టుల్లో డ్యూటీకి కార్మికులు వచ్చే క్రమంలో ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని అన్నారు. గోలేటికి వెళ్లేదారి నుంచి సీహెచ్‌పీకి నూతన రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. ఏరియా కార్యదర్శులు వేణుగోపాల్, మరిశెట్టి దత్తు, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి కిష్టస్వామి, షిఫ్ట్ ఇన్‌చార్జి కుమార్ పాల్గొన్నారు.


ఇన్‌చార్జి డీజీఎంకు వినతిపత్రం అందిస్తున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

కలెక్టరేట్ ఎదుట నిరసన

మంచిర్యాలఅగ్రికల్చర్: బీసీ రుణం కింద పద్మశాలీలకు రూ.లక్ష ఇచ్చేలా ప్రభుత్వం జీవో జారీ చేయాలని కలెక్టరేట్ ఎదుట సంఘం నాయకులు సోమవారం నిరసన చేపట్టారు. నిరసన అనంతరం కలెక్టరేట్ ఏవో సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు చిలగాని సుదర్శన్, గజెల్లి వెంకటయ్య, నాయకులు భాస్కర్, సత్యనారాయణ, ఓం ప్రకాశ్, శంకరయ్య, కుమార్, సురేష్‌బాబు, శ్రీనివాస్,లింగమూర్తి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న పద్మశాలి నాయకులు

బాలిక కిడ్నాప్.. అత్యాచారయత్నం

- ఇద్దరు యువకులపై పోక్సో కేసు
- నిందితుల కోసం పోలీసుల గాలింపు

కాగజ్‌నగర్‌టౌన్: ఇంటి ఆవరణ నుంచి బాలికను ఇద్దరు యువకులు కిడ్నాప్ చేసి, లైంగిక దాడికి యత్నించిన ఘటన పట్టణంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, బాలిక కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శివారు కాలనీకి చెందిన బాలిక(15) ఇటీవలే పదో తరగతి పూర్తి చేసింది. ఆదివారం రాత్రి ఇంటి ఆవరణలో కూర్చున్న బాలికను ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు మత్తుమందుతో ఉన్న కర్చీఫ్‌ను ముఖంపై అదిమి సమీపంలోని చెట్ల పొదల్లోకి లాక్కెళ్లారు. లైంగిక దాడికి యత్నించారు. ఓ యువకుడు గంజాయి తాగుతూ పొగను బాలిక ముఖంపై ఊదడంతో ఆమె స్పృహ కోల్పోయింది. కూతురు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులతో కలిసి పోలీసులకు సమాచారం అందించారు. అదే కాలనీకి చెందిన ఓ యువకుడిపై అనుమానం వచ్చి అతడి కుటుంబ సభ్యులను నిలదీశారు. యువకుడి కుటుంబ సభ్యులు వెంటనే అతడికి ఫోన్ చేసి నీ కోసం పోలీసులు వచ్చారని చెప్పారు. దీంతో బాలికను పొదల్లోనే వదిలేసి ఇద్దరు యువకులు పరారయ్యారు. కొద్ది సమయం తర్వాత స్పృహలోకి వచ్చిన బాలిక ఇంటికి చేరుకుంది. బాలిక ముఖంతోపాటు పలుచోట్ల స్వల్పంగా గాయాలయ్యాయి. సోమవారం బాలికతోపాటు కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇద్దరు యువకులపై పోక్సో, కిడ్నాప్, అత్యాచార యత్నం కేసులు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో బి.స్వామి వెల్లడించారు.

జాబ్‌మేళాకు స్పందన

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన లభించింది. డీమార్ట్ షాపింగ్ మాల్‌లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 38 మంది హాజరు కాగా, 10 మందికి కంపెనీ లెటర్స్ అందించారు. జిల్లా ఉపాధికల్పన అధికారి కౌశిక వెంకటరమణ, టీంలీజ్ సొల్యూషన్ హైదరాబాద్ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ప్రతినిధులు జయబాబు పాల్గొన్నారు.